క్లుప్తంగా

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



పొట్టిపాడు(గన్నవరం): ఉంగుటూరు మండలం పొట్టిపాడు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ కార్యక్రమంలో విద్యార్థులకు కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వీరవల్లి పీహెచ్‌సీ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ కొండలరావు నేతృత్వంలో నేత్ర వైద్య పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి చూపు సంబంధిత సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య శిబిరంలో 83 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. వీరిలో 11 మంది కంటి చూపు సమస్యలు ఉన్నట్లుగా గుర్తించామని, వీరికి కళ్లజోళ్లు పంపిణీ చేస్తామన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు భావి భారత నిర్మాతలు



గన్నవరంరూరల్: ఉపాధ్యాయులు భావిభారత నిర్మాతలని వీరపనేనిగూడెం జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం జి.వెంకటేశ్వరరావు కొనియాడారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మిని, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న ఎంపీపీఎస్ హెచ్‌ఎం ఎం.సరళలను హైస్కూల్‌లో శనివారం ఘనంగా సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు మన బాధ్యతను మరింత పెంచుతాయని చెప్పారు. విద్యార్థుల ఉన్నతి లక్ష్యంగా పని చేస్తున్న ఉపాధ్యాయులు అందరికీ ఆదర్శమన్నారు. వీరి స్ఫూర్తితో మిగిలిన వారు విద్య బోధన చేసి ఉత్తమ పురస్కారాలను పొందాలని ఆకాంక్షించారు. కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు, హైస్కూల్ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, ఫిజికల్ డైరెక్టర్ చాగంటిపాటి బాలకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ నియామకంపై చర్యలకు ఆదేశం

ఉయ్యూరు: ఉయ్యూరు మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఖాళీపోస్టుల నియామకంపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ డైరెక్టర్‌ను ఆశాఖ అసిస్టెంట్ సెక్రటరీ నవీన్‌బాబు ఆదేశించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. మున్సిపాలిటీలో రెండు నెలలుగా ఇన్‌చార్జి కమిషనర్‌తోనే పాలన సాగుతోంది. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నియామకం ఏళ్ల తరబడి జరగటం లేదు. పలు పోస్టుల్లో సిబ్బంది లేకపోవటంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. ఈ అంశాలపై పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ, ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్‌లకు ఫిర్యాదు చేశారు. గ్రేడ్ 2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యంలో కమిషనర్ నియామకం అంశం తెరపైకి వచ్చింది. దీంతో అసిస్టెంట్ సెక్రటరీ నవీన్‌బాబు నియామకాలపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు.

పూర్వ కమిషనర్‌పై ఫిర్యాదు..

పూర్వ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావుపై జంపాన శ్రీనివాసగౌడ్ మున్సిపల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. జూన్ 31న ఉద్యోగ విరమణ చేసినప్పటికీ చైర్మన్ కార్యాలయం నుంచి అనధికారికంగా విధులు నిర్వహిస్తూ పాత తేదీలతో బిల్లులు ఆమోదిస్తున్నారని, ప్రతినెలా డంపింగ్ యార్డు పేరుతో లక్షలాది రూపాయలు అడ్డగోలుగా డ్రా చేస్తున్నారని అనధికార లే అవుట్‌లలో రహదారులు నిర్మించి ప్రభుత్వ నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. చైర్మన్, కౌన్సిలర్లు అందరూ సమిష్టిగా ముందుకు వెళ్తూ అక్రమాలను అడ్డుకోలేకపోతున్నారని పేర్కొన్నారు.

ట్రంప్ సుంకాల భారాన్ని ఎత్తివేయాలి



కంకిపాడు: భారతదేశంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల భారాన్ని ఎత్తివేయాలని వామపక్షాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలను వ్యతిరేకిస్తూ కంకిపాడు సెంటరులో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. నేతలు మాట్లాడుతూ సుంకాల రద్దుపై నేతలు డిమాండ్ చేయాలని కోరారు. అమెరికా భారీగా సుంకాలు విధిస్తూ దేశాన్ని దోచేస్తుందని విమర్శించారు. రాష్ట్రం నుంచి ఎగుమతి అయ్యే ఆక్వా, టెక్స్‌టైల్స్, పత్తి, మిర్చిపై దెబ్బపడుతుందన్నారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి సుంకాల భారం లేకుండా పాలకులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నేత పంచకర్ల రంగారావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి.జమలయ్య, నాయకులు ఎం.అరుణ్ కుమార్, బండి ప్రేమ్‌కుమార్, పోతురాజు నాగేశ్వరరావు, వాటపల్లి ఇస్రాయేల్, యలమంచిలి వెంకటేశ్వరరావు, మండవ శ్రీనివాస్, శివశంకర్, బి.మరియదాసు, చంటిబాబు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా యూరియా పంపిణీ

- ఎకరాకు అరకట్ట యూరియా
- గరిష్టంగా 3 బస్తాల పంపిణీ
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు



చోడవరంలో యూరియా కోసం అధికారులను చుట్టిముట్టిన రైతులు

పెనమలూరు: యూరియా అందుబాటులో ఉంది.. రైతులు ఎటువంటి ఇబ్బంది లేదు.. అని కూటమి నేతలు, అధికారులు చేసిన ప్రకటనలు తుస్సుమన్నాయి. మండల పరిధిలో శనివారం రెండు గ్రామాల్లో యూరియా తూతూమంత్రంగా పంపిణీ చేసి అధికారులు చేతులెత్తేశారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలో ఖరీఫ్ వరి 5,600 ఎకరాలతో పాటు మెట్ట పంటలు దాదాపు 1,500 ఎకరాల్లో సాగు జరుగుతోంది. గత కొద్ది కాలంగా యూరియా అందుబాటులో లేకపోవటంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం మండలంలోని సాగు జరుగుతున్న పంటలకు 300 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంది.

నామమాత్రంగా యూరియా సరఫరా

కూటమి ప్రభుత్వం యూరియా నామమాత్రంగానే సరఫరా చేసింది. మండలంలో శనివారం పోరంకిలో 15 మెట్రిక్ టన్నులు, చోడవరంలో 20 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. యూరియా కోటా తక్కువగా రావటంతో అధికారులు ఎకరాకు అర కట్ట చొప్పున గరిష్ఠంగా 3 కట్టల యూరియా(కట్ట 45 కేజీలు) మాత్రమే రైతులకు ఇచ్చారు. ఆదివారం వణుకూరుకు 20 మెట్రిక్ టన్నులు, పెదపులిపాక 15 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు ఇస్తామని అధికారులు తెలిపారు. తాడిగడప, గంగూరుకు కూడా యూరియా త్వరలో వస్తుందన్నారు. వాస్తవానికి వరి ఎకరాకు యూరియా 30 కేజీలు అవసరముంది. అయితే అధికారులు సరఫరా చేసిన యూరియా పంటకు ఒక పక్కకు కూడా రాదని రైతులు వాపోతున్నారు.



యూరియా బస్తాలు

300 మెట్రిక్ టన్నులు అవసరం

మండలంలో యూరియా 300 మెట్రిక్ టన్నుల అవసరముంది. ఖరీఫ్ వరి సాగుకే దాదాపు 200 మెట్రిక్ టన్నులు కావాల్సి ఉంది. వాణిజ్య పంటలకు మరో 100 మెట్రిక్ టన్నుల యూరియా అవసరముంది. అయితే ప్రభుత్వం గత 20 రోజులుగా రైతులను ఊరిస్తూ చివరకు నామమాత్రంగానే యూరియా సరఫరా చేయటంతో రైతులు చాలా అసంతృప్తిగా ఉన్నారు. యూరియా కోసం పడిగాపులు కాసిన రైతులకు పూర్తిగా యూరియా ఇవ్వలేదు.

ఇమామ్‌లకు గౌరవ వేతనం వెంటనే చెల్లించాలి

- రేపు వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా
- పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవభక్తుని చక్రవర్తి



కానూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

పెనమలూరు: కూటమి ప్రభుత్వం ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనం వెంటనే చెల్లించాలని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవభక్తుని చక్రవర్తి డిమాండ్ చేశారు. కానూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ముస్లిం నేతలతో కలిసి నిరసన పోస్టర్‌ను చక్రవర్తి ఆవిష్కరించి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ముస్లింల పట్ల కపట ప్రేమ చూపి న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ముస్లింలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఇమామ్, మౌజమ్‌లకు గత 11 నెలలుగా గౌరవ వేతనం ప్రభుత్వం ఇవ్వలేదని ఆరోపించారు. మసీదులు, ఈద్గాల అభివృద్ధికి కూడా కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదన్నారు. ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 8వ తేదీన వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నామన్నారు. దీనికి మైనార్టీ సోదరులు తమ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు కాశిం, పార్టీ నాయకులు చాంద్‌బాషా, అబ్దుల్‌గని, అష్రఫ్, బాషా, రబ్బాని, హక్, అజీజుల్లా, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. కలిదిండి మండలం మట్టగుంట గ్రామానికి చెందిన సిరంగి అశోక్(32) ఈనెల 5వ తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత ద్విచక్రవాహనంపై కంకిపాడు నుంచి గుడివాడ వైపు వెళ్తూ కోమటిగుంట లాకులు దాటిన తరువాత రహదారి మధ్యలో ఉన్న గొయ్యి కారణంగా బైక్ అదుపుతప్పి కింద పడటంతో గాయపడ్డాడు. వాహనదారులు ప్రమాదాన్ని గుర్తించి 108 అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. ఆస్పత్రి వర్గాల సమాచారంతో ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌కు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డ్-2025 అవార్డు అందుకున్న సందర్భంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయులను, విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ.. జాతీయ స్థాయి ఆటల పోటీల్లో విద్యార్థులు పాల్గొనే విధంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు, ఆటల పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చి అవార్డు సాధించిన విద్యార్థులకు గ్రామం తరపున అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌కు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించడం గర్వకారణమన్నారు. భవిష్యత్ లో మరిన్ని పతకాలు లభించాలని ఆకాంక్షించారు. నున్న సొసైటీ మాజీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి మాట్లాడుతూ.. హైస్కూల్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ గడ్డం కుమార్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.రవిప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు టి.శ్రీలత, టి.విజయవర్మ, జాతీయ స్థాయిలో పాల్గొన్న విద్యార్థులను ఘనంగా సన్మానించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి, ఎస్‌ఎంసీ వైస్ చైర్మన్ కడవకొల్లు వీరవనిత, కమిటీ సభ్యులు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ దండు సుబ్రహ్మణ్యంరాజు, ఉపాధ్యాయులు డి.గోపినాథ్, పి.నాగేశ్వరరావు, సీహెచ్‌బీవీ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర బాలికలు ఆరోగ్యవంతంగా ఉండాలి



కంకిపాడులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, విద్యార్థినులు



ఉంగుటూరులో సూచనలిస్తున్న సీడీపీఓ మంగమ్మ



కానూరులో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి

పెనమలూరు: కిశోర బాలికలు ఆరోగ్యవంతంగా ఉండాలని సీడీపీవో కె.బేబీసుకన్య అన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో సంకల్ప్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో బేబీసుకన్య మాట్లాడుతూ.. ఆడపిల్లల పెరుగుదల, వ్యక్తిగత పరిశుభ్రత, రుతుక్రమంలో వచ్చే ఇబ్బందులు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. బాలికల భద్రత, వ్యక్తిగత నైపుణ్యం, చదువు, చట్టాలపై అవగాహన చేసుకోవాలని సూచించారు. బాలికల అభ్యున్నతికి ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు.హెచ్‌ఎం జి.సుధారాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కె.శ్రీలత, ఎల్.సులోచనారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.రేవతి, కె.సుభాషిణి, వి.ఇందిరా, కె.పేరమ్మ, సుప్రియ, నళిని, బి.కాశేశ్వరి పాల్గొన్నారు.

కానూరులో..

కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు సంకల్ప్ అవగాహన కార్యక్రమాన్ని సీడీపీవో బేబీసుకన్య నిర్వహించారు. ఆహారం, ఆరోగ్యం, విద్య, పరిశుభ్రతపై బాలికలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఆహార, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సంకల్ప్ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ జి.మంగమ్మ మాట్లాడుతూ...కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. ఆహారంలో ఎక్కువగా మునగాకు, తోటకూర, బచ్చలకూర, మెంతుకూర తీసుకోవాలని సూచించారు. బొప్పాయి, జామ, నేరేడు వంటి పోషక విలువలు కలిగిన పండ్లను తినాలని చెప్పారు. ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతిరోజు కనీసం మూడు నుండు నాలుగు లీటర్ల మంచినీరు తాగాలన్నారు. వారానికి ఒకసారి తప్పనిసారిగా ఐరన్ టాబ్లెట్ వేయాలని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.సత్యవాణి, హెచ్‌ఎం ప్రేమవతి, ఉపాధ్యాయులు సుజాత, జయలక్ష్మి, సీహెచ్‌ఓ పావనిపుష్ప, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉంగుటూరులో..

మండల కేంద్రమైన ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సంకల్ప్ ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కిశోర బాలికలు తీసుకోవాల్సిన ఆహార, ఆరోగ్య జాగ్రత్తలను సీడీపీఓ మంగమ్మ వివరించారు. హెచ్‌ఎం సీహెచ్. అనిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మాదేవి, దుర్గాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కంకిపాడు: కౌమర దశలో విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సీడీపీఓ బేబీ సుకన్య అన్నారు. పట్టణంలోని జెడ్పీ పాఠశాలలో సుస్థిరమైన ప్రణాళికతో కూడిన జ్ఞానాన్ని, నాయకత్వాన్ని నిర్వహించటం అంశంపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. సీడీపీఓ బేబి సుకన్య మాట్లాడుతూ సమతుల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. చిరు ధాన్యాలు, పోషకాలు అందించే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. చిన్నతనం నుంచి సామాజిక సేవ, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. ఆడ పిల్లలు చదువుల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.ఉమాదేవి, సూపర్‌వైజర్లు ఎస్.అన్నామణి, కె.శ్రీలత, హెల్త్ సూపర్‌వైజర్ టి.శ్యామల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జనోత్సవాలు



దావాజిగూడెంలో గణనాథుని నిమజ్జన ఊరేగింపు




ప్రొద్దుటూరులో లడ్డూ ప్రసాదం అందజేస్తున్న దేవభక్తుని చక్రవర్తి

కంకిపాడు: పెనమలూరు, కంకిపాడు నియోజకవర్గాల వ్యాప్తంగా గణేష్ నిమజ్జనోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. 11వ రోజుల పాటు పూజలందుకున్న గణనాథులు గంగమ్మ ఒడికి చేరుకున్నాయి. శనివారం విశేష పూజలు, అన్నదానాలు, లడ్డూ వేలం నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక నృత్యాలు, మేళతాళాలతో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. దీంతో వాడవాడలా కోలాహలం నెలకొంది. గణేష్ ఉత్సవ కమిటీ వైఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో శనివారం ప్రొద్దుటూరు గ్రామంలో ఏర్పాటుచేసిన వినాయకుడి ఊరేగింపు మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి హాజరయ్యారు. పార్టీ మండల కార్యదర్శి భీమవరపు నాగిరెడ్డి ఆధ్వర్యంలో యువత జాతీయ రహదారి నుంచి కార్లు, బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. వంతెన సెంటరు ప్రధాన గ్రామం వరకూ ఎడ్లబళ్లతో ఊరేగింపు జరిపించారు. విఘ్నేశ్వరుడికి చక్రవర్తి పూజలు నిర్వహించి అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు లడ్డూ ప్రసాదం అందజేశారు. కంకిపాడు పట్టణంలోని చిట్టూరి భద్రాచలం వీధిలో ఏర్పాటుచేసిన వినాయక మందిరంలో శనివారం పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద పంపిణీ చేపట్టారు


వాడవాడలా నిమజ్జన వేడుకలు

గన్నవరం: మండలంలోని బుద్దవరం రామాలయంలో గణపతి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన జరిపారు. గణనాథుడిని రాజకీయ ప్రముఖులు గద్దె క్రాంతి, యార్లగడ్డ సతీష్, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, మాజీ సర్పంచి గూడపాటి తులసీమోహన్, గన్నవరం ఉప సర్పంచ్ పాలడుగు నాని పీఏసీఎస్ అధ్యక్షుడు ముద్రబోయిన శ్రీనివాసరావు తదితరులు దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. దావాజిగూడెంలోని నాయిబ్రాహ్మణ వీధిలో శ్రీరణఅంకమ్మ ఆలయంలో జరుగుతున్న గణేష్ ఉత్సవాలు ముగిశాయి. గణపయ్యకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఏలూరు కాలువలో స్వామివారిని నిమజ్జనం చేశారు. కేసరపల్లి, గన్నవరంలో నిమజ్జన వేడుకలు జరిగాయి.

ఘనంగా గురు పూజోత్సవం



అధ్యాపకులను సత్కరిస్తున్న విద్యార్థులు



నున్నలో టీచర్లను సత్కరిస్తున్న నిర్వాహకులు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో శనివారం డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 11 మంది అధ్యాపకులను విద్యార్థులు దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గౌరవించడం విద్యార్థులు బాధ్యతగా గుర్తించాలని చెప్పారు. గురువులను ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు నవీన్, బాలచంద్రుడు, రాంబాబు, తేజకుమారి, దుర్గాభవాని, ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

నున్న(విజయవాడరూరల్): ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా నున్న వెస్ట్ ఎలిమెంటరీ పాఠశాల ఉపాధ్యాయులను లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ వైభవ్ ప్రతినిధులు శనివారం సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు విద్యాబుద్ధులు నేర్పించేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించి మెమోంటోలను బహుకరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఆర్.భారతి, ఉపాధ్యాయులు వి.రత్నాదేవి, పి.కృష్ణజయంతి, వి.సుభాష్ చంద్రబోస్, కె.జాన్సీసత్యవతిలను సన్మానించారు. హెచ్‌ఎం భారతి స్కూల్‌లో నివేదికను తెలియజేశారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నున్నలో సంపునకు మరమ్మతులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో మంచినీటిని భూమిలోపల నిల్వచేసే సంపునకు మరమ్మతులు జరుగుతున్నాయి. సుమారు 28 సంవత్సరాల క్రితం నిర్మించిన సంపు శ్లాబ్ పెచ్చులు ఊడి పడిపోవడం, శ్లాబ్‌కు ఉపయోగించిన స్టీల్ తుప్పుపట్టి పాడైపోవడంతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులను గ్రామ పంచాయతీ చేపట్టింది. ప్రస్తుతం సంపు మరమ్మతులు జరుగుతుండటంతో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి మంచినీటిని అందిస్తున్నారు. గ్రామ పంచాయతీ నిధులు 2 లక్షల రూపాయలతో మరమ్మతులు చేస్తున్నామని గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.సురేష్ తెలిపారు.

ఇంటింటి ప్రచారాన్ని బహిష్కరించిన గ్రామ సచివాలయ ఉద్యోగులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం 'మన మిత్ర' పేరిట ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్‌పై ఇంటింటి తిరిగి ప్రచారం నిర్వహించాలనే ఆదేశాలపై గ్రామ సచివాలయ సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు. బాపులపాడు మండలంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు శనివారం ఇంటింటి ప్రచారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.జోగేశ్వరరావుకు వినతిపత్రం అందించేందుకు తరలివెళ్లారు. కానీ గ్రామ సచివాలయ ఉద్యోగుల నుంచి వినతిపత్రం స్వీకరించేందుకు ఎంపీడీవో విముఖత వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మాత్తుగా ప్రభుత్వ విధులు బహిష్కరించి ఆందోళన చేయటం తగదని ఆయన చెప్పారు. గ్రామ సచివాలయ సిబ్బందిపై పనిభారం పెంచుతూ, ప్రభుత్వం తీవ్ర మానసిక ఒత్తిడి గురిచేస్తోందని ఉద్యోగులు వాపోయారు.


నేడు ఆలయాల మూసివేత

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానం చంద్రగ్రహణం సందర్భంగా మూసివేస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఎన్.భవాని తెలిపారు. ఆమె శనివారం వివరాలు తెలుపుతూ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు ఆలయం మూసివేస్తామన్నారు. సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ అనంతరం స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతిస్తామని చెప్పారు. భక్తులు సహకరించాలని ఈవో కోరారు.

నేడు పేరంటాలమ్మ ఆలయం మూసివేత

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయాన్ని ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా మూసివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు ఆలయాన్ని మూసివేస్తామన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథాతథంగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు

కౌలు రైతులకు సాగు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి



మాట్లాడుతున్న కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య

కంకిపాడు: కౌలు రైతులకు సాగు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఏపీ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. సంఘం విస్తృత స్థాయి సమావేశం శనివారం కంకిపాడులో నిర్వహించారు. జమలయ్య మాట్లాడుతూ వాస్తవ సాగుదారులందరికీ ధ్రువీకరణ పత్రాలు అందించి సాగుకు భరోసా కల్పించాలన్నారు. రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లు, ప్రైవేటు దుకాణాల్లో కౌలు కార్డు చూపాలని సూచనలు చేయటం సరికాదని చెప్పారు. రైతులు కౌలుదారులకు గుర్తింపు పత్రాలు ఇవ్వటానికి నిరాకరిస్తున్నారని, పాలకులు, అధికారులు ఈ అంశాలను గుర్తించాలని కోరారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎరువులను సరఫరా చేయటంలో పాలకులు వైఫల్యం చెందారని విమర్శించారు. సాగుకు రైతులు, కౌలురైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆరోపించారు. రైతులు, కౌలురైతులకు అవసరమైన యూరియాను సమృద్ధిగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎరువుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న తహసీల్దార్ కార్యాలయాల వద్ద చేపట్టనున్న ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నేత పి.రంగారావు, సీపీఐ నేత మున్నంగి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.